క్లుప్తంగా

పేద బాలికలకు ఉచితంగా ఆరోగ్య కార్యకర్తల శిక్షణ

కర్నూలు(అర్బన్): జిల్లాలోని అనాధలు, అంగ వైకల్యం కలిగిన పేద బాలికలకు నగరంలోని జేపీ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఆరోగ్య కార్యకర్తల శిక్షణా కోర్సులో ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నట్లు కరస్పాండెంట్ ఈ.పద్మాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు పూర్తి చేసిన వారు ఇంటర్మీడియట్ పాస్‌తో సమానమన్నారు. ఈ కోర్సు పాసయిన వారు మహిళా ఆరోగ్య కార్యకర్తగా ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హులన్నారు. కళాశాలలో హాస్టల్ వసతి ఉందని, ప్రాక్టికల్స్ స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేయిస్తామన్నారు. వివరాలకు 9848352725, 9949472206 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ముంతాజ్ బేగంకు జాతీయ యోగా రత్న అవార్డు


ఎస్. ముంతాజ్ బేగం

కర్నూలు (టౌన్): గత 15 సంవత్సరాలుగా యోగాతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జిల్లాకు చెందిన యోగా గురువు డాక్టర్ ఎస్. ముంతాజ్ బేగంకు జాతీయ యోగా టీచర్ అవార్డుతో పాటు యోగా రత్న అవార్డు దక్కింది. హర్యానాకు చెందిన మానవీయ నిర్మాణ్ మంచ్ ఇండియా ఈ అవార్డును ప్రకటించింది. ఈనెల 21వ తేదీన 10 వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె ఈ అవార్డును హర్యానాలో అందుకొనుంది. ముంతాజ్‌కు యోగా రత్న అవార్డు రావడం పట్ల యోగా సంఘం చైర్మన్ శ్రీధర్ రెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీకాంతరెడ్డి, అవినాష్, క్రీడా సంఘాల ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

క్రీడల్లో రాణిస్తే ప్రత్యేక గుర్తింపు


పోటీల్లో తలపడుతున్న సిలంబం క్రీడాకారులు

కర్నూలు (టౌన్): విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ప్రత్యేక గుర్తింపు వస్తుందని జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్ డోర్ స్టేడియంలో జిల్లా సిలంబం (కర్ర సాము) అసోసియేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమకిష్టమైన క్రీడకు ప్రతి రోజు కొంత సమయం కేటాయించి సాధన చేయాలన్నారు. దీంతో ఒత్తిడిని అధిగమించి చదువుల్లోనూ రాణిస్తారన్నారు.

రజకులకు న్యాయం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న గురుశేఖర్

కర్నూలు(సెంట్రల్): సామాజికంగా, ఆర్థికంగా ఎంతో వెనుకబడిన రజక వృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం వీరనారి ఐలమ్మ కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సి.ముక్కన్న ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత ప్రభుత్వ హయాంలో రజక ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా మార్చి నిధులు కేటాయించలేదన్నారు. సీఎం చంద్రబాబునాయుడు స్పందించి రజక కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సి.అనుమంతు, సీహెచ్ శ్రీనివాసులు, పర్ల సుంకన్న, సి.శేషాద్రి, సి.జయమ్మ, సి.రాముడు, శేఖర్, బాబు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటారు చోరీ

పాణ్యం: మండల పరిధిలోని కొండజూటూరు గ్రామానికి చెందిన గుద్దేటి శ్రీనివాసులుకు చెందిన విద్యుత్ మోటార్ చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు. పొలం వద్ద సాగునీటి కోసం బిగించుకున్న విద్యుత్ మోటారును దొంగలు వైర్లు కత్తిరించి ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు.

మహానందిలో తగ్గని రద్దీ


కోనేటిలో స్నానం చేస్తున్న భక్తులు

మహానంది: మహానంది క్షేత్రంలో భక్తుల రద్దీ తగ్గడం లేదు. వరుసగా రెండు రోజుల పాటు సెలవులు, సోమవారం ఏకాదశి కలిసి రావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి వేలాది సంఖ్యలో భక్తులు మహానందికి చేరుకుని స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామిని దర్శించుకున్నారు. స్వామి, అమ్మవారికి మహా రుద్రాభిషేకం, కుంకుమార్చనలు చేశారు. ఆర్జిత సేవల ద్వారా భక్తులు అభిషేకం, కుంకుమార్చన పూజల్లో పాల్గొన్నారు.


ఓర్వకల్లు: సందేశం వినిపిస్తున్న మత గురువు


కల్లూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


సి.బెళగల్: ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



భక్తిశ్రద్ధలతో బక్రీద్

- ఈద్గాల్లో ప్రార్థనలు చేసిన ముస్లింలు
- పండుగ విశిష్టతను వివరించిన మత పెద్దలు
- బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు


కోడుమూరులో..


ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

పాణ్యం: నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా ప్రార్థనా మందిరాల్లో మత గురువుల ఆధ్వర్యంలో ఖురాన్ ప్రవచనాలు విని ప్రత్యేక ప్రర్థనలు చేశారు. మత బోధకులు మాట్లాడుతూ.. తోటివారిపై ప్రేమ, దయ, ఉన్నంతలో కొంత దానం చేసే గుణాన్ని అలవచ్చుకోవాలని ఈదుల్ అజ్‌హా పర్వదిన పరమార్థమం అదేనని సూచించారు. పాణ్యం ఎంపీడీఓ కార్యాలయం పక్కన ఉన్న ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

ఓర్వకల్లు: బక్రీద్ త్యాగానికి ప్రతీకగా జరుపుకునే పండుగ అని మత గురువు ముజీపూర్ రెహ్మాన్ అన్నారు. సోమవారం మండలంలోని అన్ని గ్రామాల్లో ముస్లింలు బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకున్నారు. అందరూ నూతన వస్త్రాలు ధరించి టుంబ సమేతంగా ఆయా గ్రామాల్లోని ఈద్గాల్లో ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ఖురాన్ సారాంశాన్ని వివరించారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, నిరుపేదలకు దానధర్మాలు చేయడం పండుగ ప్రత్యేకమని తెలిపారు. అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

కల్లూరు: బక్రీద్‌ను మండల వ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులు, ఈద్గాల్లో ప్రార్థనలు చేశారు.

ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు

సి.బెళగల్: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో సోమవారం ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ముస్లింలు అల్లాను ధ్యానిస్తూ మసీదులు, ఈద్గాల వద్దకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ మత పెద్దలు ప్రార్థనలు చేయించి బక్రీద్ పండుగ ప్రత్యేకతను వివరించారు. సి.బెళగల్‌లో ఢిల్లీ నుంచి వచ్చిన హఫీసాబ్ ప్రార్థనలను ఉద్దేశించి మాట్లాడుతూ.. ముస్లింలు త్యాగం, శాంతి స్వభావంతో మెలగాలని తెలిపారు. ప్రార్థనలు ముగియగానే తిరుగుబాటలో అక్కడికొచ్చిన పేదలకు తోచినంత సాయం చేశారు. ఇళ్లకు చేరుకున్న అనంతరం పండుగా ఆనవాయితీ ప్రకారం కొందరు ఖుర్బానీ పంచి పెట్టారు. మండలంలోని గొల్లలదొడ్డి, సంగాల, పోలకల్, మారందొడ్డి, ముడుమాల, గుండ్రేవుల, కొత్తకోట, కంబదహల్ తదితర గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. సి.బెళగల్ ఈద్గా వద్ద ఎస్ఐ తిమ్మారెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు.


సి.బెళగల్: బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్ఐ తిమ్మారెడ్డి

కోడుమూరు రూరల్: మండల కేంద్రంలోని ముస్లింలు నూతన వస్త్రాలు ధరించి కోడుమూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఈద్గా, క్రిష్ణాపురం రోడ్డు వైపు నున్న మదర్‌సా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే మండలంలోని పులకుర్తి, క్రిష్ణాపురం, వర్కూరు, ప్యాలకుర్తి, లద్దగిరి, అమడగుంట్ల తదితర గ్రామాల్లోని మసీదులు, ఈద్గాల్లో ప్రార్థనలు చేశారు. పేదలకు దానం చేశారు.

లంబాడి హక్కులను కాపాడుకుందాం

- ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కైలాస్‌నాయక్


సమావేశంలో మాట్లాడుతున్న కైలాస్ నాయక్

ఓర్వకల్లు: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని లంబాడి హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కైలాస్ నాయక్ అన్నారు. సోమవారం ఓర్వకల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సంఘం ముఖ్య నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కైలాస్ నాయక్ మాట్లాడుతూ.. 'మా తండాలో మా రాజ్యం.. మేము ఎంత మందిమో అంత వాటా' అనే నినాదంతో 1997 జులై 1వ తేదీ లంబాడి హక్కుల పోరాట సంఘాన్ని నెలకొల్పినట్లు తెలిపారు. సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జులై 1వ తేదీ చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించాలని కార్యాచరణ చేస్తున్నట్లు చెప్పారు. నేషనల్ గోర్ బంజారా సమ్మేళన్ పేరుతో దేశవ్యాప్తంగా ఉన్న బంజారా జాతి ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని లంబాడి మేధావులు, పెద్దలు, విద్యార్థి సంఘాలు తరలిరావడానికి సిద్ధంగా ఉండాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి నాగరాజు నాయక్, రాష్ట్ర షెడ్యూల్ ట్రైబ్ ఉపాధ్యక్షులు రామునాయక్, రంగస్వామి నాయక్, శ్రీనునాయక్, లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.

70మందికి రక్తదానం


రక్తదానం చేస్తున్న స్థానికులు

పాణ్యం: బక్రీద్‌ను పురస్కరించుకుని పాణ్యం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నంద్యాల విజయ బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 70 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమని పేర్కొన్నారు. అనేక మంది ప్రాణాలను నిలిబెట్టినవారవుతారని తెలిపారు. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి నష్టం ఉండదని.. అపోహలు వద్దని సూచించారు.

23న ఒలింపిక్ డే రన్


క్రీడాసంఘాల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు

కర్నూలు (టౌన్): ఈనెల 23న కర్నూలు నగరంలో ఒలింపిక్ డేను పురస్కరించుకుని రన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు రామాంజనేయులు తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో ఒలింపిక్ క్రీడల షెడ్యూల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18న స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్ డోర్ స్టేడియంలో అంతర్ పాఠశాల బాలబాలికల బాస్కెట్ బాల్ పోటీలు, 19న ఫుట్‌బాల్ పోటీలు, 20న తైక్వాండో పోటీలు, అదే రోజు స్థానిక గణేష్ నగర్‌లో స్కేటింగ్ రింక్‌లో స్కేటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అలాగే 23వ తేదీ కలెక్టరేట్ నుంచి కొండారెడ్డిబురుజు వరకు ఒలింపిక్ డే రన్ ఉంటుందన్నారు. ఒలింపిక్ డే సంబరాల్లో విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు, క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బాస్కెట్‌బాల్ కోచ్ మృతి


భూషణ్‌రావు (ఫైల్)

కర్నూలు (టౌన్): సీనియర్ బాస్కెట్‌బాల్ కోచ్ భూషణ్ రావు అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయన స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియంలో బాస్కెట్‌బాల్ కోచ్‌గా గ్రౌండ్ సూపర్‌వైజర్‌గా సుదీర్ఘంగా సేవలు అందించారు. 20 సంవత్సరాల బాస్కెట్ బాల్ శిక్షణలో ఎంతో మంది రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేశారు. ఇతని వద్ద శిక్షణ పొందిన ఎంతో మంది బాస్కెట్ బాల్ క్రీడాకారులు పోలీసు డిపార్టుమెంటు, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం ఆయన కర్నూలు నుంచి శ్రీకాకుళం బదిలీ అయ్యారు. ఇటీవల అనారోగ్యానికి గురై కోలుకోలేక సోమవారం ఉదయం మృతి చెందారు. ఆయన మృతికి స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం అధికారులు, సిబ్బంది, ఒలంపిక్ సంఘం నాయకులు, క్రీడా సంఘాల ప్రతినిధులు సానుభూతి వ్యక్తం చేశారు.

గణపతి సచ్చిదానంద స్వామి జన్మదిన వేడుకలు


పూజలో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: అవధూత దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో స్వామి జన్మదినాన్ని పురస్కరించుకొని స్వామీజీ పాదుకలకు పురుష సూక్త రుద్ర పారాయణ సుగంధ ద్రవ్య జలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. జయలక్ష్మి మాతృ మండలి సభ్యులచే సంపూర్ణ భగవద్గీత పారాయణం, లక్ష్మీ గణపతి, మృత్యుంజయ, ఆయుష్య, ఆదిత్యాది నవగ్రహ హోమాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ నగేష్ వర్మ, రాజేశ్వరి, సుజాతమ్మ, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పొలం విషయంలో ఘర్షణ

- పలువురికి గాయాలు

తుగ్గలి: మండల పరిధిలోని బొల్లవానిపల్లిలో పొలం వివాదంలో జరిగిన ఘర్షణలో పలువురు గాయపడ్డారు. ఓ వర్గానికి చెందిన జానకిరామిరెడ్డి, గోవిందరెడ్డి, మరో వర్గానికి చెందిన సోమశేఖర రెడ్డి, రంగారెడ్డిల మధ్య కొన్నేళ్లుగా భూ వివాదం నెలకొంది. సోమవారం ఈ విషయమై మాటామాటా పెరిగి ఘర్షణ పడగా నలుగురూ గాయపడ్డారు. వీరిలో గోవిందరెడ్డి తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై జొన్నగిరి ఎస్ఐ రామాంజనేయులును సంప్రదించగా బాధితుల ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేస్తామన్నారు.

ఎమ్మెల్యేలను కలిసిన డీటీఎఫ్ నాయకులు

కర్నూలు సిటీ: జిల్లాలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని డీటీఎఫ్ నాయకులు ఆదివారం ఆ ఎమ్మెల్యేల కార్యాలయాల్లో కలిశారు. ఎమ్మెల్యేలను సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప మాట్లాడుతూ విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యేలను కలిసిన వారిలో ఆ సంఘం పత్రిక ప్రధాన సంపాదకులు రత్నం ఏసేపు, జిల్లా నాయకులు బజారప్ప, సుబ్బారాయుడు, గోపాల్, రాఘవేంద్రరావు, సోమశేఖర్, హుసేన్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హొళగుంద: మార్లమడికి వద్ద వేదావతి నది నుంచి ఇసుకను తరలిస్తున్న 5 ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం రాత్రి నదిలో అక్రమంగా ఇసుకను తవ్వుతున్నట్లు సమాచారం తెలుసుకున్న ఎస్ఐ పెద్దయ్యనాయుడు, సిబ్బంది అక్కడికెళ్లగా డ్రైవర్లు ట్రాలీలను వదిలి ఇంజిన్‌లతో పరారయ్యారు. పోలీసులు వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమానులను గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

అదనపు కట్నం కేసులో ముగ్గురిపై కేసు నమోదు

రుద్రవరం: అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని మండలంలోని పెద్దకంబలూరుకు చెందిన భవాని ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. భవానికి మూడేళ్ల క్రితం ప్రకాశం జిల్లా బెస్తవారి పేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన తిరుపతితో పెద్దలు వివాహం జరిపించారు. పెళ్లి అయిన కొద్ది రోజుల నుంచి భర్తతో పాటు అత్త కోటమ్మ, మామ నారాయణ ముగ్గురు అదనపు కట్నం తీసుకురావాలని మానసికంగా, శారీరకంగా వేధించే వారు. అయినప్పటికీ ఆమె సర్దుకొని పోయేది. గత కొద్ది రోజుల నుంచి వేధింపులు అధికం కావడంతో భరించలేక పుట్టింటికి వచ్చేసింది. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

ఈరన్న స్వామికి అభిషేక పూజలు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సోమవారం సెలవు రోజు కావడంతో స్వామి క్షేత్రంలో భక్తులతో సందడి నెలకొంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. కొందరు భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకునేందుకు ఆలయం ఆవరణలో పిండి వంటలు వండి స్వామివారికి నైవేద్యం సమర్పించారు.

మొక్కలతోనే మానవ మనుగడ


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఓర్వకల్లు: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని నన్నూరు టోల్ ప్లాజా ప్రాజెక్టు ప్రతినిధి మదన్ మోహన్ అన్నారు. సోమవారం ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లె వద్ద హైవే పెట్రోలింగ్ సిబ్బంది ఆధ్వర్యంలో 'చెట్టును నాటుదాం.. ప్రకృతిని కాపాడుకుందాం' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం వల్ల భవిష్యత్ తరాల వారికి ఆరోగ్యకర జీవితం ఇచ్చిన వారమవుతామని తెలిపారు. మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. చెట్లు ఆక్సీజన్‌ను ఉత్పత్తి చేసి, కార్బన్ డైయాక్సైడ్‌ను పీల్చుకుంటాయని చెప్పారు. చెట్లు కాలుష్యాన్ని శోషించి, గాలి పరిశుభ్రతను మెరుగుపర్చడానికి దోహదం చేస్తాయని వివరించారు.

7న మాదిగల జనజాతర మహాసభ


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు మాదిగ

కర్నూలు(అర్బన్): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి స్థాపించి 30 సంవత్సరాలు కావొస్తున్న సందర్భంగా ప్రకాశం జిల్లా ఈదుమూడి గ్రామంలో జూలై 7వ తేదీన లక్షలాది మంది మాదిగలతో జనజాతర మహాసభను నిర్వహిస్తున్నట్లు ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ ఎస్. వెంకటేశ్వర్లు మాదిగ తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు పులికొండ మాదిగ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాదిగ మాట్లాడుతూ మాదిగలకు ఆత్మగౌరవం తీసుకువచ్చిన ఈదుమూడి గ్రామంలో ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ నాయకత్వంలో ఈ మహాసభను నిర్వహిస్తున్నామన్నారు. మూడు దశాబ్దాల ఆవిర్భావ దినోత్సవ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న జనజాతర మహాసభకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో మాదిగలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు గద్ద రాజశేఖర్ మాదిగ, రాజారత్నం మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరరాజు మాదిగ, జిల్లా యువసేన అధ్యక్షులు డేవిడ్ మాదిగ, నాయకులు శ్రీను మాదిగ, సురేష్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక భగవద్గీత పారాయణం


సామూహిక భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో ఏకాదశిని పురస్కరించుకొని సంకల్ బాగ్‌లోని గీతా ప్రచార ధామలో సోమవారం సామూహిక సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహించారు. ధార్మిక సంస్థల ప్రతినిథులు, భక్తులు పాల్గొని అత్యంత భక్తి శ్రద్ధలతో భగవద్గీత పారాయణం చేశారు. ప్రవచన కర్త కల్లే వేణుగోపాల్ శర్మ మాట్లాడుతూ మానవ జీవిత పరమార్థం తెలుసుకోవాలంటే భగవద్గీత చదివి తీరాలన్నారు. కార్యక్రమంలో గీతా ప్రచార సంఘం అధ్యక్షులు డీవీ రమణ, తరిగొండ వెంగమాంబ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షురాలు పసుపులేటి నీలిమ, గీతా ప్రచార సంఘం కార్యదర్శులు సింహాద్రి రమేష్, రమణ, మహాబలేష్, జగదీష్, అనిల్, నారాయణ, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల వేలంలో భారీ ఆదాయం

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని పెద్దదేవలాపురం, నారాయణపురం గ్రామాల్లోని దేవస్థానం భూములకు ఏడాది పాటు కౌలుకు సోమవారం వేలం పాట నిర్వహించినట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. పెద్దదేవలాపురంలో రూ.17,29,300 ఆదాయం లభించిందన్నారు. గత ఏడాది కన్నా ఈ సంవత్సరం రూ. 4,94,100 అధికంగా ఆదాయం వచ్చినట్లు చెప్పారు. అలాగే నారాయణపురంలో రూ.5,04600 వచ్చిందని గత సంవత్సరం కన్నా రూ.18,100 అధిక ఆదాయం లభించిందన్నారు.

నేరేడు పండు.. పోషకాలు మెండు


బండిపై అమ్మకానికి ఉంచిన నేరేడు పండ్లు

కోడుమూరు రూరల్: వర్షాకాలం ప్రారంభంలో దొరికే నేరేడు పండ్లకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. నేరేడు పండ్లలో కాల్షియం, ఐరన్, పొటాషియం, ఏ,సీ విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. రోగ నిరోధక శక్తిని పెంచే ఎన్నో ఔషధ గుణాలు, బీపీ, షుగర్‌ను నియంత్రించే గుణం ఉండడంతో ప్రజలు విరివిగా ఈ పండ్లను కొంటున్నారు. కిడ్నీలో ఉండే రాళ్లను సైతం కరిగించే శక్తి ఉండడంతో నేరేడు పండ్లను తినేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఆదోని, కోసిగి వంటి ప్రాంతాల నుంచి నేరేడు పండ్లను తీసుకొచ్చి కోడుమూరులో విక్రయిస్తున్నారు.